క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దర్శి: ఎస్ఎస్‌పీ కాలనీలోని 33 కేవీ నూతన లైన్ ఏర్పాటు పనుల కారణంగా శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు దర్శి ఎస్ఎస్‌పీ సబ్ స్టేషన్ పరిధిలోని అద్దంకి రోడ్డు, పుచ్చలమెట్ట, ఆటోనగర్, మోటుపల్లి రోడ్డు ఏరియాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ సచ్చన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని ఆయన కోరారు.

దీపావళి మందులు అనుమతితో అమ్మాలి


మాట్లాడుతున్న ఎస్ఐ సాంబశివయ్య

పెద్దారవీడు: దీపావళి మందుల విక్రయానికి వ్యాపారులు అనుమతి తీసుకోవాలని ఎస్ఐ వి.సాంబశివయ్య తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా క్రాకర్స్, టపాసులు అమ్మరాదని చెప్పారు. దీపావళి పండగ సందర్భంగా ముందుగా నిల్వలు చేయడం, అమ్మడం చట్టరీత్యా నేరమన్నారు. ప్రభుత్వం ద్వారా తగిన అనుమతులు పొందకుండా క్రాకర్స్ అమ్మరాదని, అనుమతి తీసుకున్న వ్యాపారులు తగిన నిబంధనలు పాటించాల్సి ఉంటుందన్నారు. గ్రామాల్లో అనుమతి లేకుండా పేలుడు వస్తువులు అమ్మిన వారి వివరాలు పోలీసులకు ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్సై పేర్కొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం


ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ అల్లుకున్న తీగలు

పుల్లలచెరువు: మండలంలోని కొత్తూరు వద్ద ప్రధాన రహదారి పక్కనే ప్రమాదం పొంచి ఉంది. ప్రధాన రహదారిపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద స్తంభాలకు తీగచెట్లు అల్లుకుని ఉన్నాయి. అదే దారిలో నిత్యం మేత కోసం వెళ్లి పశువులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి తీగ చెట్లను తొలగించి ప్రమాదం నుంచి పశువులను కాపాడలని స్థానికులు కోరుతున్నారు.

తాళ్లూరు అభివృద్ధికి కృషి చేయాలి


పంచాయతీ కార్మికులతో మాట్లాడుతున్న డీపీఓ వెంకటేశ్వరరావు

తాళ్లూరు: మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, మండల ప్రత్యేకాధికారి, డీపీఓ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రం తాళ్లూరులో గురువారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉంటూ మెడికల్ క్యాంప్‌లు నిర్వహించాలని కోరారు. వీధుల్లో చెత్తా చెదారం సేకరించి చెత్త సంపద కేంద్రాలకు తరలించాలని సూచించారు. తడి పొడి చెత్తను వేరు చేసి వర్మీ కంపోస్ట్ తయారు చేసి రైతులకు వినియోగించాలన్నారు. మంచి నీటి ట్యాంక్‌లను రోజూ శుభ్రం చేయాలన్నారు. అధికారులు సమయపాలన పాటిస్తూ ప్రజలకు ఆఫీసుల్లో అందుబాటులో ఉండాలన్నారు. ఎంపీడీవో పి.అజిత, సర్పంచ్ చార్లెస్ సర్జన్, పంచాయతీ కార్యదర్శి షహనాజ్ బేగం ఉన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధ్యాపకులు

దొనకొండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కె.దునుమణి ఆధ్వర్యంలో విద్యార్థులకు మానవ వనరుల అభివృద్ధి, డిజిటల్ సాధికారతపై గురువారం వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఒకే దేశం, ఒకే పన్ను విధానం, సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్ తదితర విషయాలపై విద్యార్థులకు పూర్తి స్థాయి అవగాహన కల్పించారు. మొదటి బహుమతి సాయికృష్ణ, రెండో బహుమతి షేక్ ఫాతిమా, మూడో బహుమతి నవీన్‌కుమార్‌లు సాధించారు. వారికి ప్రిన్సిపాల్ దునుమణి బహుమతులు అందజేశారు.

ఆహార సలహా కమిటీలు ఎక్కడ?

- రేషన్ దుకాణాలపై కొరవడిన పర్యవేక్షణ
- నిత్యావసరాల పంపిణీలో అవకతవకలు
- పట్టించుకోని అధికారులు


పుల్లలచెరువు తహసీల్దార్ కార్యాలయం

పుల్లలచెరువు: రేషన్ దుకాణాల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసి నిరుపేదలకు నిత్యావసరాలు అందే విధంగా పర్యవేక్షించే ఆహార సలహా సంఘ సభ్యులు ఎక్కడా కనిపించడం లేదు. ప్రస్తుతం ఈ సంఘాల ఉనికి లేక పోవడంతో పర్యవేక్షణ అధికారులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో రేషన్ దుకాణాల్లో అనేక మోసాలు జరుగుతున్నాయి. అదే విధంగా లబ్ధిదారులకు నిత్యావసరాలు సక్రమంగా అందడం లేదనే విమర్శలు వస్తున్నాయి. గతంలో ఆహార సలహా కమిటీలు ప్రతి మూడు నెలలకు ఒకసారి సమావేశం నిర్వహించేది. సమావేశంలో మండల స్థాయిలోని రేషన్ దుకాణాల నిర్వహణపై సమీక్షించే వారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దదోర్నాల, పెద్దారవీడు, యర్రగొండపాలెం మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లోని గ్రామాల్లో 173 రేషన్ దుకాణాలు ఉన్నాయి. ఆహార సలహా కమిటీ చైర్మన్‌గా జిల్లా స్థాయిలో కలెక్టర్, మండల స్థాయిలో తహశీల్దార్ చైర్మన్‌గా వ్యవహరించే వారు. సభ్యులుగా ఎంపీడీవో, జెడ్పీటీసీ సభ్యులు, ప్రాతికేయులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులను నామినేట్ చేసే వారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఆహార సలహా కమిటీ సమావేశం ఏర్పాటు చేసి నిత్యావసర వస్తువులు సక్రమంగా అందుతున్నాయా.. లేదా అని సమీక్షించేవారు. నేడు ఆ పరిస్థితి లేక పోవడంతో నిత్యావసరాల పంపిణీలో అవకతవకలు చోటుచేసుకుంటున్నాయి.

వై.పాలెం నియోజకవర్గంలో రేషన్ దుకాణాలు

మండలం	రేషన్ దుకాణాలు	కార్డుదారులు
పుల్లలచెరువు	42	17789
యర్రగొండపాలెం	43	20016
త్రిపురాంతకం	35	19068
దోర్నాల	30	13456
పెద్దారవీడు	23	13540

ఇష్టారాజ్యంగా నిత్యావసరాల పంపిణీ

ఆహార సలహా సంఘాలు లేక పోవడంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. రేషన్ దుకాణాలకు పంపిణీ సరకుల్లో నాణ్యతను పరిశీలించే వారు, తుకాల్లో తేడా చూసే వారు లేక పోవడంతో డీలర్లు ఇష్టానుసారంగా పంపిణీ చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎండీయూ వాహనాల ఆపరేటర్ల ద్వారా వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి రేషన్ అందించే వారు. దీంతో లబ్ధిదారులకు నిత్యావసరాలు ఇబ్బంది లేకుండా అందాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ వ్యవస్థ పూర్తిగా గాడి తప్పిందని పలువురు పేర్కొంటున్నారు.

* * *

సలహా కమిటీలు ఏర్పాటు చేయాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ అక్రమంగా తరలించే పరిస్థితి ఎక్కువగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో రేషన్ దుకాణాలను తనిఖీ చేయకపోవడంతో డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఆహార సలహా కమిటీలు ఏర్పాటు చేస్తే కొంత వరకు అక్రమాలు అరికట్టడంతో పాటు తుకాల్లో తేడాలను గుర్తించి లబ్ధిదారులకు న్యాయం జరుగుతుంది. కూటమి ప్రభుత్వం స్పందించి ఆహార సలహా కమిటీలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

– జి.గురునాథం, సీపీఐ కార్యదర్శి, పుల్లలచెరువు

ఎమ్మెల్యే సొంత నిధులతో డీప్‌బోర్


నల్లగుంట్ల ఎస్సీ పాలెంలో నీరు పట్టుకుంటున్న ప్రజలు

- నల్లగుంట్ల ఎస్సీ కాలనీలో తొలగిన నీటి సమస్య

పెద్దదోర్నాల: యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన డీప్‌బోర్‌తో మండల పరిధిలోని నల్లగుంట్ల ఎస్సీ కాలనీలో నీటి సమస్యలు తొలగిపోయాయి. గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఎమ్మెల్యే తాటిపర్తి డీప్‌బోర్ ఏర్పాటు చేసిన నేపథ్యంలో వైఎస్సార్ సీపీ నాయకులు మొద్దు తిరపతిరావు గురువారం డీప్‌బోర్‌కు సంబంధించి సబ్ మెర్సిబుల్ మోటార్, పైపులు ఏర్పాటు చేయటంతో నీటి సమస్య తొలగింది. తమ కాలనీలోని నీటి సమస్యను తొలగించిన ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ నాయకుడు మొద్దు తిరుపతిరావు, పార్టీ మండల కన్వీనర్ గంటా రమణారెడ్డిలకు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.

పౌష్టికాహారం వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న సీడీపీఓ లక్ష్మీబాయి

పెద్దదోర్నాల: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలని సీడీపీఓ లక్ష్మీబాయి పేర్కొన్నారు. పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా గురువారం మండల పరిధిలోని చిన్నగుడిపాడు అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. గర్భిణులు, బాలింతలు రక్తహీనత నివారించుకునేందుకు ఆకుకూరలు విరివిగా వినియోగించుకోవాలని సూచించారు. గర్భిణులు అందుబాటులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు అంగన్‌వాడీల సలహాలు, సూచనలు తీసుకోవాలని కోరారు. సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, అంగన్‌వాడీ కార్యకర్త వెంకటలక్ష్మి, లూథియా, బాలాకుమారి పాల్గొన్నారు.

విద్యార్థులు మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

దర్శి: విద్యార్థులు మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని జిల్లా బాలికా అభివృద్ధి అధికారి కె.హేమలత, రాష్ట్ర సమగ్ర శిక్ష కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కో ఆర్డినేటర్ డాక్టర్ కేపీ వెంకట సుబ్బయ్య సూచించారు. ప్రపంచ మానసిక వారోత్సవ కార్యక్రమంలో భాగంగా దర్శి, ముండ్లమూరు కేజీబీవీ పాఠశాలలను గురువారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా హేమలత, వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ విద్యార్థులు వివిధ అపోహల నుంచి బయట పడే విధానం, సామర్థ్యాలను పెంపొందించుకునేందుకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. విద్యార్థి ఒత్తిడికి గురి కాకుండా అనుసరించాల్సిన విధానాలు ప్రయోగాత్మకంగా వివిధ చర్చల ద్వారా వివరించారు. ఎవరైనా బాల్య వివాహాలు చేసుకుంటే ఫిర్యాదులు చేయాలని సూచించారు. ప్రిన్సిపాళ్లు అరుణ, ఆవుల సునీత, ఉపాధ్యాయులు పద్మజ, రత్నమాలినీదేవి, రాధిక, మాలతి, సుహాసిని పాల్గొన్నారు.

షేడ్‌నెట్ నర్సరీలు రిజిస్టర్ చేసుకోవాలి


వై.పాలెంలో నర్సరీలను తనిఖీ చేస్తున్న హెచ్‌వో ఆదిరెడ్డి

యర్రగొండపాలెం: షేడ్ నెట్ నర్సరీలు తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకొని లైసెన్స్ పొంది ఉండాలని ఉద్యానశాఖాధికారి పి.ఆదిరెడ్డి అన్నారు. గురువారం నియోజకవర్గంలో ఉన్న షేడ్ నెట్ నర్సరీలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్స్ లేని నర్సరీల యజమానులపై చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. గతంలో లైసెన్స్ పొందిన వారు తిరిగి రెన్యూవల్ చేయించుకోవాలని, కొత్తగా నర్సరీలు ఏర్పాటు చేసుకునే వారు లైసెన్స్ కోసం దరఖాస్తు పెట్టుకోవాలని సూచించారు. నర్సరీల యజమానులు మిరప విత్తనాలు అధికృత డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలని, వాటికి తగిన బిల్లులు చూపించాలన్నారు. నర్సరీ యాక్ట్ ప్రకారం సీడ్స్ రిజిష్టర్, సేల్స్ రిజిష్టర్, ఇన్‌స్పెక్షన్, ప్లాంట్ ప్రొటెక్షన్ రిజిష్టర్లు తప్పని సరిగా నిర్వహించాలన్నారు. రైతులు నారు కొనే సమయంలో బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలని ఆయన కోరారు.


మార్జిన్‌లు శుభ్రం చేస్తున్న కూలీలు


రోడ్లపై హెచ్చరిక బోర్డులు

నల్లమలలో జంగిల్ క్లియరెన్స్

పెద్దదోర్నాల: దేశ ప్రధాని నరేంద్రమోదీ శ్రీశైలం పర్యటన ఖరారైన నేపథ్యంలో అధికారులు అందుకు తగ్గట్లు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. దీంతో శ్రీశైలానికి ముఖద్వారంగా వెలుగొందుతున్న పెద్దదోర్నాల మండల కేంద్రం నుంచి శ్రీశైల పుణ్య క్షేత్రం వరకు రోడ్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నారు. ఈ నెల 16న దేశ ప్రధాని నరేంద్రమోదీ శ్రీశైలం పర్యటనకు రానున్న నేపథ్యంలో శ్రీశైలం జాతీయ రహదారి 765కు సంబంధించిన పనులు వేగవంతమయ్యాయి. ఇందు కోసం వందల మంది కూలీలు, జేసీబీలతో రోడ్ల మార్జిన్, మార్కింగ్ పనులు ఇప్పటికే మొదలయ్యాయి. నల్లమల అభయారణ్యంలో గురువారం జంగిల్ క్లియరెన్స్, రోడ్డు మార్కింగ్ పనులు ప్రారంభమయ్యాయి.


పొదలను తొలగిస్తున్న జేసీబీలు


మార్కింగ్‌లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

నేటి నుంచి బోధనేతర పనుల బహిష్కరణ


ఎంఈఓకు వినతిపత్రం ఇస్తున్న అధికారులు

కురిచేడు: ఉపాధ్యాయులు శుక్రవారం నుంచి బోధనేతర పనులు బహిష్కరించనున్నారు. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన పనులు మాత్రమే చేస్తారని, మూల్యాంకనానికి సంబంధించి పరీక్షల నిర్వహణ తప్ప ఏ ఇతర బోధనేతర పనులు చేయరని మండల ఫ్యాప్టో నాయకులు తెలిపారు. ఈ మేరకు వారు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయులు రాచమల్లు శ్రీనివాసరెడ్డి, షేక్ ఖాదర్‌వలి, చప్పిడి శివరామకృష్ణ, అన్నెం శ్రీనివాసరెడ్డి, ఆకుల వెంకటస్వామి, మైలవరపు శ్రీనివాసరావు, షేక్ మహబూబ్‌బాషా, డి.లక్ష్మయ్య, షేక్ మస్తాన్‌వలి, మణికుమార్, చక్రపాణి, సింగారయ్య, ఏసుదాసు ఆధ్వర్యంలో మండల విద్యాధికారులు ఆర్.వస్త్రాం నాయక్, సీహెచ్ సుబ్బారావుకు మండల విద్యావనరుల కేంద్రంలో మెమోరాండం సమర్పించారు.


వినతిపత్రం చూపుతున్న ఉపాధ్యాయులు

దర్శి: ఫ్యాప్టో పిలుపు మేరకు శుక్రవారం నుంచి బోధనా కార్యక్రమాలు తప్ప వేరే ఏ ఇతర బోధనేతర కార్యక్రమాలు చేపట్టబోమని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేవీజీ కీర్తి, ఫ్యాప్టో కన్వీనర్ బి.వెంకట్రావు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దన్‌రెడ్డిలు స్పష్టం చేశారు. ఈ మేరకు దర్శి జోన్ ఫ్యాప్టో కార్యకర్తలతో కలిసి ఎంఈఓ కాకర్ల రఘురామయ్యకు గురువారం మెమొరాండం ఇచ్చారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.శ్రీను, జి.రాజశేఖర్, వివిధ సంఘాల బాధ్యులు శ్రీనివాసరావు, ఎన్.కోటేశ్వరరావు, రంగస్వామి, గోవింద్, శీను, కె.వెంకటేశ్వరరావు, కె.వెంకటేశ్వర్లు, పి.కాశీం, కమ్మ శ్రీను, అమర శ్రీను, అట్లూరి రామారావు, కె.నరసింహారావు, జి.వేణు, వి.చక్రధర్, ఎం.వెంకటేశ్వర్లు ఎస్‌కే బాషా, శ్రీనివాస్‌రెడ్డి, వరకాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కల్తీ మద్యం పేటెంట్‌దారులెవరో తేలిపోయింది


గౌస్ మొహిద్దీన్

మార్కాపురం: రాష్ట్రంలో తాజాగా పట్టుబడుతున్న కల్తీమద్యం ఘటనల్లో పేటెంటుదారులు టీడీపీ నేతలేనని తేలిపోయిందని వైఎస్సార్ సీపీ మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ గౌస్ మొహిద్దీన్ అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో కల్తీమద్యంతో అమాయక పేద ప్రజల ప్రాణాలతో చలగాటం ఆడవద్దని విజ్ఞప్తి చేశారు. కల్తీ మద్యం తయారుచేసే టీడీపీ నేతలు వైఎస్సార్ సీపీని దూషించడం వింతగా ఉందన్నారు. మద్యం అమ్మకాలను తగ్గించే చర్యలను నాటి సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తీసుకోగా టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు నాడు విమర్శించారని అన్నారు. నేడు రాష్ట్రంలో ఎక్కడ కల్తీమద్యం పట్టుబడుతున్నా దానికి సూత్రధారులు టీడీపీ నేతలేనని బయటపడుతున్న ఘటనలు రుజువు చేస్తున్నాయన్నారు.

రేపు పాల సమాజం

దొనకొండ: స్థానిక ఏబీఎం చర్చిలో శనివారం ఉదయం 10 గంటలకు పాల సమాజం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘ కమిటీ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దర్శి నియోజకవర్గంలోని 5 మండలాల పాస్టర్లు, సంఘ పెద్దల ఆత్మీయ సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. సమావేశానికి హాజరై జయప్రదం చేయాలని కోరారు. ప్రేమతో విందు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న వెదురు స్వాధీనం


పట్టుబడ్డ వెదురు కట్టలు

గిద్దలూరు రూరల్: అక్రమంగా తరలిస్తున్న వెదురు కట్టలను స్థానిక రైల్వేస్టేషన్‌లో గురువారం అటవీశాఖ అధికారులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ వారు సంయుక్తంగా కలిసి స్వాధీనం చేసుకున్నారు. నల్లమల అటవీ ప్రాంతంలో నుంచి కొందరు వ్యక్తులు వెదురు కలపను కట్టలుగా కట్టుకుని డోన్ నుంచి గుంటూరుకు వెళ్లే ప్యాసింజర్ రైలులో అక్రమంగా తరలించేందుకు ప్రయత్నించగా అధికారులు వాటిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ వెదురు కట్టలను గిద్దలూరు అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. రైలులో ప్రయాణించే ప్రయాణికులకు ఇబ్బందికరంగా ఉండేలా వెదురు కట్టలను రైలు బోగీలల్లో ఉంచి రవాణా చేయడంపై ఆర్‌పిఎఫ్ సిబ్బంది ఎన్నిసార్లు వారికి కౌన్సెలింగ్ ఇచ్చినప్పటికి ప్రయోజనం లేకుండా పోతుందని ఎస్సై పిచ్చిరెడ్డి తెలిపాడు. అడవి నుంచి వెదురు కలప రైలులో అక్రమంగా తరలివెళుతున్న కర్రలను స్వాధీనం చేసుకుని అటవిశాఖ అధికారులకు అప్పగిస్తున్నామని తెలిపారు.

పంట కోత ప్రయోగాలు సకాలంలో పూర్తి చేయాలి


మాట్లాడుతున్న బాలాజీనాయక్

దర్శి: పంట కోత ప్రయోగాలు సకాలంలో పూర్తి చేయాలని దర్శి సహాయ వ్యవసాయ సంచాలకులు కె.బాలాజీనాయక్ సూచించారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో దర్శి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని 8 మండలాల గ్రామ రైతు సేవా కేంద్ర సిబ్బందికి పంట కోత ప్రయోగాలపై గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా బాలాజీ నాయక్ మాట్లాడుతూ పంట కోత ప్రయోగాలతో కలిగే ప్రయోజనాలు వివరించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో భాగంగా పంటల బీమా రావాలంటే తప్పనిసరిగా పంట కోత ప్రయోగాల ప్రామాణికగా తీసుకుంటామని తెలిపారు. రైతు సేవా కేంద్ర సిబ్బంది సకాలంలో పంట కోత ప్రయోగాలు పూర్తి చేయాలని ఆదేశించారు. డీవైఎస్ఓ సుధాకర్ మాట్లాడుతూ పంట కోత ప్రయోగాలు ప్లాట్ సెలక్షన్, యాప్‌లో ఫారం 1,2 పూర్తి చేసే విధానం గురించి వివరించారు. పంట కోత ప్రయోగంలో పాటించాల్సిన నియమాలు తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ జి.రమేష్, శాస్త్రవేత్త మానస, సాంకేతిక వ్యవసాయాధికారి, 8 మండలాల వ్యవసాయాధికారులు, వ్యవసాయ విస్తరణాధికారులు, గ్రామ రైతు సేవా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణంలో గంజాయి, మట్కా దందా


గంజాయిని సీసాలో నింపుకున్న యువకులు

కంభం: పట్టణంలో గంజాయి, మట్కా దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. చిన్నపిల్లలు సైతం గంజాయి మత్తుకు బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. రెండు రోజుల క్రితం రాత్రి సుమారు 10 మంది యువకులు గంజాయి ఆకును సీసాలో నింపి అందులో నిప్పంటించి పొగను పీల్చుకుంటూ మత్తులో మునిగితేలిపోయారు. గంజాయి మత్తులో తూగుతూ ఆయువకులు తీసుకున్న వీడియో కాస్త బయటకు రావడంతో వైరల్‌గా మారింది. వీరిలో ఎక్కువమంది మైనర్లు ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో విషయం తెలుసుకున్న పోలీసులు పలువురు యువకులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. పట్టణంలోని అర్బన్ కాలనీ, రైల్వేస్టేషన్ సమీపం, నక్కలగండి సమీపం, హైవే రోడ్డులోని 30 అడుగుల రోడ్డు వద్ద గంజాయి చేతులు మారుతోంది. గంజాయితో పాటు ఆన్‌లైన్ మట్కా సైతం జోరుగా సాగుతుంది. కొందరు మట్కా బుకీలు టీస్టాల్స్, హోటల్స్, లాడ్జీలలో కూర్చొని దందా సాగిస్తున్నారు. హైవే రోడ్డుపై ఉన్న పలు లాడ్జీలు సైతం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిపోతున్నాయి. గతంలో పలుమార్లు లాడ్జీలలో గంజాయి నిందితులు పట్టుబడిన సందర్భాలు ఉన్నాయి. ఇంకా పలువురు యువకులు పట్టణంలో స్పోర్ట్స్ బైక్‌లపై పెద్ద పెద్ద శబ్దాలు చేసుకుంటూ విద్యార్థినిలను, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న వారిపై పోలీసులు దృష్టి సారించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.